సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు ధర్మారావు

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- రుణమాఫీపై చర్చకు సిద్ధమా?
- మాజీ జడ్పీటీసీ ధర్మారావు సవాల్

గీసుగొండ, జనవరి 26: నియోజకవర్గ ప్రజలను మోసం చేయకుండా వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కోరారు. ఆదివారం కోనాయిమాకులలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో పర్యటించిన రేవూరి తనను గెలిపిస్తే వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని ప్రజలకు బాండ్ పేపర్లపై అపడవిట్లు ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి గుర్తుంచుకోవాలని హితవు పలికారు. పరకాలను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దిన మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేశామని చెప్పకుంటున్న కాంగ్రెస్.. చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. పార్టీ మండల నాయకుడు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుంటే లబ్ధిదారుడు ఏ పార్టీకి చెందిన వాడని అడుతున్న కాంగ్రెస్ నాయకులు.. పార్టీలకతీతంగా పథకాలు అందించిన చల్లాపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. కమీషన్ల కోసం పని చేసే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో ఉందని విమర్శించారు. బీఆర్ఎస్, చల్లా ధర్మారెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ నేతలకు లేదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు ముంత రాజయ్య, మాజీ సర్పంచ్‌లు పూండ్రు జైపాల్‌రెడ్డి, బోడకుంట్ల ప్రకాశ్, అంకతీ నాగేశ్వర్ రావు, జక్కు మురళి, నాయకులు గుర్రం రఘు, కోటి, కట్టయ్య, రఘుపతిరెడ్డి, ధనుంజయ్, మోతీలాల్, రాజేందర్, కేదారి, అభిషేక్, సంతోష్, లెనిన్, ప్రమోద్, రాజేందర్, అజార్, లింగయ్య, సొసైటీ చైర్మన్ రవీందర్, వైస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

పాకాలను సందర్శించిన జడ్జి

ఖానాపురం, జనవరి 26: పాకాలను ఆదివారం నర్సంపేట మున్సిఫ్ కోర్టు జడ్జి ఎ.ప్రదీప్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాకాల కట్ట, తూములు, సీతాకోక చిలుకల పార్కును పరిశీలించారు. అనంతరం నర్సంపేట న్యాయవాదులతో కలిసి సరస్సులో బోటు షికారు చేశారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి, సీనియర్ న్యాయవాదులు అంబటి శ్రీనివాస్, దాసి రమేశ్, కొడిదెల సంజయ్‌కుమార్, రహీముద్దీన్, కిరణ్‌కుమార్, ప్రభాకర్, వీరేశ్, రాజు, ప్రభాకర్, తిరుమల్ చౌహాన్, రంగనాథ స్వామి ఉన్నారు.

పాకాల సరస్సులో బోటింగ్ చేస్తున్న జడ్జి, న్యాయవాదులు

వర్ధన్నపేట: లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్యశారద, నెక్కొండ: బొల్లికొండలో అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నిరుపేదలకే సంక్షేమ పథకాలు అందిస్తాం

జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందొద్దు

రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

వర్ధన్నపేట/ఖానాపురం/చెన్నారావుపేట/నెక్కొండ/సంగెం/గీసుగొండ/రాయపర్తి/నర్సంపేట/పర్వతగిరి, జనవరి 26: నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లె (బొక్కలగూడెం)లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కలెక్టర్ సత్యశారదతో కలిసి రైతు భరోసా, ఇందిరమ్మ ఆతీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తొలి విడతలో ప్రభుత్వం నాలుగు పథకాలను ఒకేరోజు ప్రారంభించిందన్నారు. జాబితాల్లో పేర్లు లేని వారు ఆందోళన చెందొద్దన్నారు. కాగా, మంత్రి పాల్గొన్న సభకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో సామాన్యులు మంత్రిని కలిసి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం లేకపోవడంతో స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఖానాపురం మండలం రాగంపేటలో జరిగిన కార్యక్రమంలో దొంతి పాల్గొని సంక్షేమ పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌లో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే దొంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా పథకాల ప్రొసీడింగ్స్ అందించారు. నెక్కొండ మండలంలోని బొల్లికొండలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సంగెం మండలంలోని షాపురంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. గీసుగొండ మండలం కోనాయిమాకులలోని రైతు వేదికలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అందజేశారు. మొదటి విడతలో పైలట్ ప్రాజెక్టుగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. రాయపర్తి మండలంలోని మహబూబ్‌నగర్ గ్రామం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైనందున పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నర్సంపేట మండలంలోని పర్మనాయక్‌తండాలో ప్రొసీడింగ్స్‌ను జిల్లా బీసీ సంక్షేమ అధికారి, నర్సంపేట మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ పంపిణీ చేశారు. నల్లబెల్లి మండలంలోని అర్కనపల్లిలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ హాజరై సంక్షేమ పథకాలను ప్రారంభించారు. పర్వతగిరి మండలంలోని జమాల్‌పురంలో ప్రభుత్వ పథకాలను వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, డీపీవో కల్పన, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్ నాయక్ లాంఛనంగా ప్రారంభించారు.

రాయపర్తి: పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, నల్లబెల్లి: రామతీర్థంలో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

28న ములుగురోడ్డులో జాబ్‌మేళా

పోచమ్మమైదాన్, జనవరి 26: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 28న వరంగల్ ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా ఉపాధి అధికారి ఎం.మల్లయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని ఆక్సిస్ బ్యాంకులో 50 బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కోసం 18 నుంచి 28 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 7893394393 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అలాగే, ఈ నెల 29న అపోలో ఫార్మసీలో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వరంగల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ఉమారాణి తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో ఫార్మసిస్టులు, ట్రైనీ ఫార్మసిస్టులు, ఫార్మసీ అసిస్టెంట్లు, రిటేల్ ట్రైనీ అసోసియేట్ ఉద్యోగాల కోసం డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, టెన్త్, ఇంటర్, డిగ్రీతో పాటు మెడికల్ స్ట్రోర్ అనుభవం కలిసి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు వివరాలకు 709316 8464 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

చెన్నారావుపేట, జనవరి 26: మండలంలోని ఉప్పరపల్లి కార్యదర్శి దబ్బెట కృష్ణంరాజు తమ్ముడు విజేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి జ్ఞాపకార్థం కృష్ణంరాజు తాను పని చేస్తున్న ఉప్పరపల్లిలోని సర్కారు బడి విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా రూ. 18 వేల విలువైన బహుమతులు అందజేశారు. హెచ్ఎం జయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో నాలా పనులు ప్రారంభం

గీసుగొండ, జనవరి 26: మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో నాలా పనులను ఆదివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రారంభించారు. పార్కులో రూ. 160 కోట్లతో నిర్మించనున్న నాలా పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. నాయకులు కొమురారెడ్డి, నరేందర్, వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ ఈవోపై బదిలీ వేటు

మహదేవపూర్(కాళేశ్వరం),జనవరి 26: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరముక్తీశ్వర ఆలయ ఈవోపై బదిలీ వేటు పడింది. ఇటీవల గర్భగుడిలో సింగర్ మధుప్రియ అనుమతి లేకుండా పాట చిత్రీకరణ చేయడంతో ఆయనను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

నారక్కపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పెద్ది

అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శం: పెద్ది

నల్లబెల్లి, జనవరి 26: అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నారక్కపేటలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం పెద్ది ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. ములుగు జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో మానంగా రాణిస్తున్నారంటే అది అంబేద్కర్ వల్లే అన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్యాక్స్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్‌రావు పాల్గొన్నారు.

'అపార్'కు అడ్డంకులు!

- పిల్లల అడ్మిషన్ రికార్డుతో సరిపోలని ఆధార్ వివరాలు
- ఎదురవుతున్న సమస్యలు
- జిల్లాలో 45 శాతం కూడా నమోదు కాని వివరాలు

గిర్మాజీపేట, జనవరి 26: 'ఒకే దేశం– ఒకే విద్యార్థి' నినాదంతో కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ రిజిస్ట్రీ)కు అడుగుడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. విద్యార్థుల ఆధార్ వివరాలతో స్కూల్‌లో నమోదైన కొన్ని వివరాలు సరిపోలకపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో జిల్లాలో ఇప్పటివరకు 45 శాతమే నమోదైనట్లు జిల్లా విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. మరోవైపు ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు కేంద్రం ఇచ్చిన గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. గడువు ముగిసే నాటికి అపార్ నమోదు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. కేంద్రం అపార్‌ను ప్రవేశపెట్టిన ఉద్దేశం మంచిదే అయినప్పటికీ క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలపై సరైన అధ్యయనం చేయకుండానే హడావుడిగా ఈ ప్రక్రియ చేపట్టడంతో ఆశించిన స్థాయిలో నమోదు కావడం లేదు. అదేవిధంగా జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ కారణంగా వీటి ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్లు లేని కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఎదురవుతున్న సమస్యలు ఇవే..

విద్యార్థుల అడ్మిషన్ రికార్డులో వివరాలు ఆధార్‌లోని వివరాలతో సరిపోలకపోవడమే అసలు సమస్య. అలాగే, అపార్ కార్డులో వివరాల నమోదుకు తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. చాలామంది సమాచార, సమన్వయ లోపంతో అంగీకార లేఖ అందించకపోవడం వివరాల నమోదుకు అడ్డంకిగా మారుతున్నది. వాస్తవానికి అడ్మిషన్ రికార్డులో వివరాల ఆధారంగా యూడైస్ ప్లస్‌ను విద్యాశాఖ వందశాతం పూర్తి చేసింది. ఇదే సమయంలో అపార్ నమోదు మాత్రం అంతసులువుగా పూర్తి కావడం లేదు. ఆధార్‌లో ఇంటి పేరు లేదా చిరునామాలో ఒక అక్షరం తేడా ఉన్న అపార్‌లో నమోదు కావడం లేదు. ఆధార్ సవరించాలంటే పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం కచ్చితంగా కావాలి. అనేక మంది పిల్లలకు పుట్టిన ఏడాదిలోనే ఆధార్ తీసుకుంటున్న సమయంలో వారి వివరాలను సరిగా నమోదు చేయడం లేదు. ఇవికాక వివరాల నమోదు సమయంలో చిన్నచిన్న అక్షర దోషాలతో పేర్లు, చిరునామాలు నమోదవుతున్నాయి. ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే గడువు పెంచాలని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

రాజడి

యూపీఎస్ వచ్చేస్తోంది..

ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమలును మోదీ సర్కారు ప్రకటించింది. పదవీ విరమణ పొందినవారికి పింఛన్ హామీ, ఆర్థిక భద్రతలే లక్ష్యంగా పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్), జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రెండింటి ప్రయోజనాలను కలగలిపి ఈ యూపీఎస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. అయితే అర్హులైనవారికి ఈ యూపీఎస్ ఎలాంటి పరిస్థితుల్లో వర్తిస్తుందో కూడా ఇందులో పేర్కొన్నారు.

పదవీ విరమణ

కనీసం పదేండ్లు ఎంపిక చేసిన సేవలు అందించి, ఆ తర్వాత రిటైరైన ఉద్యోగులకు యూపీఎస్ వర్తిస్తుంది.

ఎఫ్ఆర్ 56(జే) కింద రిటైర్మెంట్

పెనాల్టీ ప్రొవిజన్స్ కింద కాకుండా రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు.

వాలంటరీ రిటైర్మెంట్

కనీసం 25 ఏండ్లు పనిచేసి, ఆ తర్వాత స్వచ్ఛంధ పదవీ విరమణ తీసుకున్నవారికి రిటైర్మెంట్ వయసు వచ్చాకే పింఛన్.

ఇలాగైతే రాదు..

డిస్మిస్, ఉద్యోగం నుంచి తొలగించిన వారు, రాజీనామా చేసినవారికి యూపీఎస్‌ను ఎంచుకొనే అవకాశం ఉండదు.

యూపీఎస్ ప్రయోజనాలు

- 25 ఏండ్లు లేదా అంతకుమించి క్వాలిఫైయింగ్ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్‌కు ముందు చివరి 12 నెలలు అందుకున్న వేతనంలోని సగటు బేసిక్ పేలో 50 శాతాన్ని నెల నెలా పింఛన్‌గా అందిస్తారు. సర్వీస్ 25 ఏండ్ల కంటే తక్కువగా ఉంటే పింఛన్ తగ్గుతుంది.
- క్వాలిఫైయింగ్ సర్వీస్‌లో 10 ఏండ్లు, అంతకుమించి ఉన్న ఉద్యోగులకు నెలకు కనీసం రూ.10,000 పింఛన్‌గా చెల్లిస్తారు. 25 ఏండ్లు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నవారికి, పదవీ విరమణ వయసు వచ్చాకే పింఛన్ మొదలవుతుంది.
- పదవీ విరమణ అనంతరం పింఛన్‌దారుడు చనిపోతే.. ఆ పింఛన్‌లో 60 శాతం భార్య లేదా భర్తకి వస్తుంది.
- నిబంధనలకు లోబడి ఉద్యోగులకు డీఏ తరహాలోనే పింఛన్‌దారుడు, వారు లేకపోతే భాగస్వామికి డియర్‌నెస్ రిలీఫ్‌నూ చెల్లిస్తారు. పింఛన్ మొదలైతేనే వస్తుంది.
- అదనంగా పదవీ విరమణ సమయంలో క్వాలిఫైయింగ్ సర్వీస్‌లోని ప్రతీ ఆరు నెలల కాలానికి నెలవారీ బేసిక్ పే, డీఏలో 10 శాతం చొప్పున లెక్కించి ఎన్నేండ్లయితే అన్నేండ్లకు ఒకేసారి చెల్లిస్తారు. ఈ మొత్తం పింఛన్‌లో తగ్గించరు.

ఇలా ట్రై చేద్దామా..!

లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండే

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మొన్నటి దాకా తగ్గుముఖం పడుతున్నట్టు కనిపించినా.. తిరిగి పుంజుకున్నాయి. దీంతో చాలా మంది అవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లకు వెళ్లడం లేదు. ఇంకొందరైతే రేట్లు మరింత తగ్గుతాయేమోనని ఎదురుచూస్తూ ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాముల విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.83,000 దాటేసింది మరి. అయితే సరిగ్గా ఇప్పుడే లో క్యారెట్ గోల్డ్.. కొనుగోలుదారులకు చక్కని ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత), 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత)లే కాకుండా 18, 14, 10 క్యారెట్ బంగారు ఆభరణాలు కూడా దొరుకుతాయి. నిజానికి ఇప్పుడిప్పుడే ఈ లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండ్ కనిపిస్తుండటం మార్కెట్‌లో మారిన ట్రెండ్‌కు నిదర్శనం.

బడ్జెట్‌కు తగ్గట్టుగా..

కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా ఇటీవలికాలంలో బడా జ్యుయెల్లర్స్, ప్రముఖ నగల వర్తకులు సైతం 18 క్యారెట్ బంగారు ఆభరణాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. మరికొన్ని చిన్నచిన్న జ్యుయెల్లర్స్ 14, 10 క్యారెట్ బంగారు నగలనూ తెస్తున్నారు. పైగా భారతీయ మార్కెట్‌లో మెజారిటీ వాటా మిడిల్ క్లాస్ కస్టమర్లదే కావడంతో జ్యుయెల్లర్స్ దృష్టి ఈ లో క్యారెట్ విభాగంపై గట్టిగానే పడుతున్నది. ఇక వీటిలోనూ నచ్చిన, రకరకాల డిజైన్లు ఇప్పుడు లభిస్తుండటం విశేషం. దీంతో ఎగువ మధ్యతరగతి నుంచి దిగువ మధ్యతరగతి వర్గాలదాకా అంతా వీటి కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా యువత కూడా మక్కువ చూపుతున్నది. అలాగే ధర తక్కువ కావడం, ఆకర్షణీయంగా కూడా ఉండటంతో మార్కెట్‌లో వీటికి నానాటికీ డిమాండ్ పెరుగుతూపోతున్నది. అందరి బడ్జెట్‌కు తగ్గట్టుగా అందుబాటులో ఉంటుండటంతో పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాలకూ ఎక్కువగా వీటినే ఎంచుకుంటుండటం ఈ మధ్యకాలంలో పెరిగిందనే చెప్పవచ్చు.

నాణ్యతకు ఢోకా లేదు

22 క్యారెట్ నుంచి 10 క్యారెట్ వరకు ఆయా ఆభరణాల్లో బంగారం వినియోగం తగ్గుతున్నకొద్దీ వెండి, రాగి, జింక్, నికెల్, పల్లాడియం తదితర లోహాల వాటా పెరుగుతుంది. అందుకే వాటి ధరల్లో అంత తేడా. 22 క్యారెట్ బంగారు ఆభరణాల్లో బంగారం వాటా ఎక్కువగా ఉంటుంది కనుక సహజంగా వీటి రేటు అధికం. 24 క్యారెట్ గోల్డ్ రేటుకు దగ్గర్లోనే పలుకుతుంది. నిజానికి స్వచ్ఛమైన బంగారంతో నగలను తయారు చేయలేం. అందుకే వాటిలో ఇతర లోహాలను కొద్దిగానైనా కలుపుతారు. ఇదే క్రమంలో గోల్డ్ క్యారెట్ తగ్గుతున్నకొద్దీ ఇతర లోహాల పరిమాణం పెరుగుతూపోతుంది. అంతమాత్రం చేత నాణ్యతకు ఢోకా ఉండదు. ఇంకా చెప్పాలంటే 22 క్యారెట్ కంటే 18 క్యారెట్ బంగారు ఆభరణాలే గట్టిగా ఉన్నాయని వినియోగదారులు చెప్పుండటం గమనార్హం.

చివరగా..

ధరలు పెరిగాయనో.. డబ్బు సరిపడా లేదనో కాకుండా మీ బడ్జెట్‌లో ఆయా రకాలలో క్యారెట్ నగలను ఆనందంగా కొనేయండి. అయితే మోసాలకు తావు లేకుండా జాగ్రత్తపడటం మాత్రం మరిచిపోవద్దు. అన్ని నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? లేదా? అన్నది కనుక్కోవడం మంచిది. ఇక వీటిని మళ్లీ అమ్ముకున్నా.. తరుగుపోను అందులోని బంగారానికి అప్పటి రేటు ఎలాగూ లభిస్తుంది. ధర తక్కువైతే అప్పుడు మరింత హై క్యారెట్ బంగారు నగలకు అప్‌గ్రేడ్ అయిపోండి.

రెండేండ్ల క్రితం దేశీయంగా నగల అమ్మకాల్లో 5 నుంచి 7 శాతంగా ఉన్న లో క్యారెట్ గోల్డ్ ఆర్నమెంట్స్ వాటా.. ఇప్పుడు 15% దాటిపోవడం మారిన ట్రెండ్‌కు అద్దం పడుతున్నది.

-సురేంద్ర మెహెతా, భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ సంఘం కార్యదర్శి

తేలికపాటి నగల హవా

ఒకప్పుడు నడుములు వంగిపోయేంతదాకా నగలు ధరించేవారు. భారీ డిజైన్లతో.. తులాలకొద్దీ బంగారాన్ని పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు అంతంత బరువైన నగలను వేసుకొనేందుకు సంపన్నులు సైతం ఇష్టపడటం లేదు. దీంతో మార్కెట్‌లో తేలికపాటి బంగారు నగలకే ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంటున్నదని నగల వ్యాపారులు అంటున్నారు. నగల తయారీలో వచ్చిన కొత్త టెక్నాలజీ.. సంప్రదాయ, భారీ డిజైన్లనూ తక్కువ బంగారాన్ని వినియోగించి స్వల్ప బరువుకే అందుబాటులోకి తెచ్చేలా చేసిందని ప్రపంచ స్వర్ణ మండలి భారతీయ కార్యకలాపాల విభాగం సీఈవో సచిన్ జైన్ చెప్పున్నారు. మొత్తానికి లైట్ వెయిట్.. లో క్యారెట్ గోల్డ్ ఇప్పుడు పసిడి మార్కెట్‌ను శాసిస్తున్నాయనడంలో సందేహం లేదు.

ఇదీ క్యారెట్ కథ..

- **24 క్యారెట్‌లో 99.90 శాతం స్వచ్ఛమైన పుత్తడి ఉంటుంది. దీన్నే మేలిమి బంగారంగా కూడా పిలుస్తారు. కడ్డీలు, బిస్కట్లు, నాణేల రూపంలో అమ్ముతారు.**
- **22 క్యారెట్‌లో 91.67 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి లభిస్తుంది. మిగతా 8.33 శాతం (5 శాతం వెండి, 2 శాతం రాగి, 1.33 శాతం జింక్) ఇతర లోహాల మిశ్రమం ఉంటుంది. అత్యుత్తమ శ్రేణి నగల తయారీకి దీన్నే వాడుతారు.**
- **18 క్యారెట్‌లో 75 శాతం ప్యూర్ గోల్డ్ కనిపిస్తుంది. 25 శాతం ఇతర లోహాలే.**
- **14 క్యారెట్‌లో 58.33 శాతం స్వచ్ఛమైన బంగారం. 41.67 శాతం వేర్వేరు లోహాలను కలుపుతారు.**
- **10 క్యారెట్‌లో 41.67 శాతం బంగారం, 58.33 శాతం ఇతర లోహాలు.**



సూచీలకు బడ్జెటే దిక్సూచి

దేశీయ స్టాక్ మార్కెట్లు రివర్స్‌గేర్‌లోనే నడుస్తున్నాయి. గత వారంలోనూ నిరాశపర్చాయి. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలో ఉండిపోతున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 428.87 పాయింట్లు లేదా 0.55 శాతం దిగజారి 76,190.46 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 111 పాయింట్లు లేదా 0.47 శాతం క్షీణించి 23,092.20 దగ్గర ఆగింది. అయితే ఈ వారం బడ్జెట్ అంచనాలు, నిర్ణయాలు.. మార్కెట్లకు దిక్సూచిగా ఉండనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025–26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఇది శనివారమైనప్పటికీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగనున్నది. సాధారణంగా శని, ఆదివారాలు స్టాక్ మార్కెట్లకు సెలవు అన్న విషయం తెలిసిందే. దీంతో బడ్జెట్‌ను ఇన్వెస్టర్లు మెచ్చితే సూచీలు పైకి, లేకుంటే కిందికి అనుకోవచ్చు. ప్రధానంగా ఆయా రంగాల షేర్లను పన్నులు, ప్రోత్సాహకాలు నడిపిస్తాయని చెప్పవచ్చు. ఆదాయ పన్నుల్లో ఊరట లభిస్తే ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ షేర్లకు ఊతమిచ్చినట్టే. అలాకాకున్నా ఇవే ముందుగా ప్రభావితం కావచ్చు. ఇక డాలర్‌తో పోల్చితే ఇంకా ఆమోదయోగ్యం కాని స్థాయిల్లోనే కొట్టుమిట్టాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ కీలకమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,700 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,500 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,300–23,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

మార్కెట్ పల్స్

*గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్